# నగరం.. మరింత సుందరం

- రాజమహేంద్రికి కొత్తందం
- రూ.కోటితో పుష్కర ప్లాజా నిర్మాణం

**రాజమహేంద్రవరం సిటీ:** రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన ఉన్న ఆ స్థలం మొన్నటి వరకూ పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉండేది. అటుగా వెళ్లడానికి ప్రజలు భయపడేవారు. కానీ నేడు అదొక సుందర ప్రదేశంగా రూపుదిద్దుకుంది. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ చేపట్టిన సుందరీకరణ యజ్ఞంలో భాగంగా రాజమహేంద్రవరం నగరంలో ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక ప్రదేశమైన పుష్కరఘాట్ సమీపంలో ఈ ప్రాంతాన్ని నగర పాలక సంస్థ అందంగా తీర్చిదిద్దింది. కార్పొరేషన్‌కు అతి సమీపంలోని ఏపీ ఎన్‌జీఓ హోం వెనుక ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ ఆధునిక హంగులతో పుష్కర్ ప్లాజాను రూపొందించారు. రాజమహేంద్రవరంలో నూతనంగా తయారవుతున్న సుందర ప్రదేశాల్లో పుష్కర ప్లాజా ప్రత్యేక స్థానం సంపాదించకోనుంది. పవిత్ర గోదావరి తీరాన ప్రసిద్ధి చెందిన పుష్కర ఘాట్ వద్ద ఈ విధమైన ఏర్పాటుతో నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు పర్యాటక ప్రదేశంగా మారనుంది.



రాజమహేంద్రవరంలోని పుష్కర ప్లాజా

**ప్రత్యేక ఆకర్షణ**

సుమారు 200 మీటర్లు పైబడి ఉండే ఈ రోడ్డును పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. సందర్శకులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతానికి మరింత అందాన్ని తీసుకుని వచ్చేందుకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణ. పూర్తిస్థాయి గ్రీనరీ ఏర్పాటు, సందర్శకులు ఫొటోలు దిగేందుకు సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి మొదలుకుని అండర్ గ్రౌండ్ సబ్‌వే వరకూ ఆ రోడ్‌ను ఆధునీకరించారు. అర్బన్ ఫుడ్ ప్లాజా మాదిరి ఈ రోడ్డును సుందరంగా తయారు చేశారు. నగరంలో అత్యధిక సందర్శకుల తాకిడి ఉండే ప్రదేశాల్లో పుష్కర్ ఘాట్ మొదటి స్థానంలో ఉంటుంది. ఇక్కడ కూర్చునే అవకాశం తక్కువగా ఉండటంతో చిన్నారులతో సందర్శనకు వచ్చే మహిళలు ఇబ్బందులు పడేవారు. పుష్కర్‌ప్లాజా ఏర్పాటుతో ఆ ఇబ్బంది తీరనుంది.

**పూర్తిస్థాయి పర్యవేక్షణ అవసరం**

పుష్కరఘాట్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. నగర పాలక సంస్థ రాత్రి సమయంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ ఏర్పాటు చేయాల్సిన అవసరరం ఉంది. లేని పక్షంలో అసాంఘిక శక్తులు, యాచకులకు ఆవాసంగా మారే ప్రమాదం ఉంది.

**త్వరలోనే ప్రారంభిస్తాం**

రూ.కోటి వ్యయంతో నిర్మాణం చేపట్టిన పుష్కర ప్లాజ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేస్తున్నాం. నగరంలో మరో అద్భుతమైన ప్రదేశంగా ఇది మారనుంది.
– పాండురంగారావు, ఎస్ఈ, నగర పాలక సంస్థ


ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్


సందర్శకులు సేదదీరేందుకు ప్రత్యేక ఏర్పాట్లు


ప్రత్యేక వాల్ డెకరేషన్

## క్లుప్తంగా

### రవి కుమార్‌కు అవార్డు


రవికుమార్‌కు అవార్డు అందజేస్తున్న జోసెఫ్ ఆన్

**రాజమహేంద్రవరం రూరల్:** సౌత్ కొరియాకు చెందిన గ్లోబల్ పీస్ అంబాసిడర్ ప్రొఫెసర్ జోసెఫ్ ఆన్ చేతుల మీదుగా హుకుంపేటకు చెందిన గుడ్ సమారిటన్ ఆర్మీ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వెన్నపు రవి కుమార్ గుడ్ సమారిటన్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. ఏజెన్సీలోని నిరుపేదలకు తమ సంస్థ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని శుక్రవారం రాత్రి విజయవాడలో అందించారని రవి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ అద్దంకి రాజాయోనా, డి.సరిల్ రిచర్డ్స్ పాల్గొన్నారు.

### యోగా నిత్యాభ్యాసం కావాలి


యోగా శిక్షణలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్

**రాజమహేంద్రవరం సిటీ:** నేటి యాంత్రిక జీవితంలో ప్రజలు నిత్యం యోగా సాధన చేయాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణను డీఎంహెచ్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా శిక్షకులు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మే 14 వరకూ జరిగే ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### గోసంరక్షణ సేవాసమితి ఏర్పాటు


గోసంరక్షణ సమితి సభ్యులు

**కడియం:** స్థానిక భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి గోసంరక్షణ సేవాసమితి ఏర్పాటైంది. సమితి అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు), మరో 20 మంది సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సమితి సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

### రాగి గ్లాసుల పంపిణీ

**కంబాలచెరువు:** జగనన్న గోరుముద్దలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావను ఇస్తున్న నేపథ్యంలో, దానిని తాగేందుకు వీలుగా రాగి గ్లాసులను డీఐ బి.దిలీప్ కుమార్ ఆదివారం ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. వీటిని స్టోర్‌రూముల్లో భద్రపరచాలని సూచించారు.

### నేడు కార్మిక ప్రదర్శన

**ప్రకాశం నగర్:** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని సోమవారం సీపీఐ జట్టు సంఘం, ఏఐటీయూసీ సంయుక్తంగా కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని, 11 గంటలకు ఊర్వశి థియేటర్ కూరగాయల మార్కెట్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సప్పా రమణ అతిథులుగా హాజరవుతారన్నారు.

### నేడు స్పందన

**రాజమహేంద్రవరం రూరల్:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల స్థాయి స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ పి.చిన్నారావు, ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

### వేసవి సెలవుల్లోనే బదిలీలు చేపట్టాలి

**కంబాలచెరువు:** యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఆ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు జయకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వేసవి సెలవులలోనే జరపాలన్నారు. మన్యం పార్వతీపురం జిల్లాలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల అక్రమ సస్పెన్షన్లకు వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు చేసిన పోరాటం సంఘ పోరాట స్ఫూర్తికి అద్దం పట్టిందన్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా వెళ్లడం వల్ల అడ్డంకులు ఎదురై, చివరకు బదిలీల జీవోలు రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు రాంబాబు, విజయగౌరి, కోశాధికారి ప్రసాద్, కార్యదర్శులు సత్యనారాయణ, ఎస్.రవిబాబు, రమేష్ బాబు, శ్రీమణి, ఎం.రవి, మనోహర్ పాల్గొన్నారు.

## ఆణివెళ్ల రామానికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రామం

**రాజమహేంద్రవరం సిటీ:** వివాహ పరిచయ వేదికల నిర్వహణలో 25 ఏళ్లుగా విశేష కృషి చేస్తున్న ఆణివెళ్ల రామానికి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య కీ.శే. పోడూరి గుర్రాజు పంతులు స్మారక పురస్కారాన్ని అందించింది. ఆదివారం సీతంపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమాఖ్య ఉపాధ్యక్షులు కొంపెల్ల రామచంద్రమూర్తి పురస్కారాన్ని రామానికి అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు వైవీ జగన్నాథరావు, రాష్ట్ర బ్రాహ్మణ యువజన అధ్యక్షుడు సూరంపూడి కామేష్, నగర బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, కోరుకొండ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి భాస్కరరామ్ పాల్గొన్నారు.

## నూకశాతాన్ని పరిశీలించే యంత్రం ఏర్పాటు

**కడియం:** ధాన్యంలో నూకశాతం పరిశీలించే యంత్రాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. రైతుల ఇబ్బందుల నేపథ్యంలో ఇటీవలే తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు నూకశాతం పరిశీలించే యంత్రాన్ని ఆదివారం తీసుకువచ్చారు. అలాగే సోమవారం నుంచి సంబంధిత సాంకేతిక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతామని తహసీల్దార్ సుజాత తెలిపారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు.

# చిత్తశుద్ధితో సంక్షేమ పథకాల అమలు

- రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్


రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత స్టాలిన్‌ను సత్కరిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు

**కడియం:** సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటినుంచీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, వాటిని చూసి ఓటు వేయాలని ప్రజలను అడుగుతున్నామని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. అయితే ప్రతిపక్షాలు ఈ పథకాలను రద్దు చేస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళ్లగలవా అని ప్రశ్నించారు. విమెన్ ఫ్రెండ్లీ విభాగంలో ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్న జేగురుపాడు పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అభినందన సభను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం వేమగిరిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌తో కలిసి పిల్లి బోస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులోకి తెచ్చింది సీఎం వైఎస్ జగన్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 3,500 వ్యాధులను ఆరోగ్య శ్రీ పరిధిలోకి చేర్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. 27 వేల కోట్ల పనిదినాలను, 14 వేల కోట్ల పనిదినాలకు కేంద్రం తగ్గించి వేసిందన్నారు. దీంతో ఉపాధి హామీ పనుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎఫ్‌సీఐ సేకరించిక పోయినప్పటికీ బొండాలు సాగు చేసిన రైతులు నష్టపోకూడదన్న ఉద్దేశంతో, వారికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనేక సమస్యల మధ్య, పరిమిత వనరులతో రాష్ట్రం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ స్టాలిన్ స్ఫూర్తితో ఇతర గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జేగురుపాడు గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో స్టాలిన్ చొరవను అభినందించారు. మెమెంటో, పూలమాలలతో స్టాలిన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరజాల వీర్రాజు (బాబు), అనసూరి పద్మలత, పిల్లి నిర్మలాకుమారి, ఈలి గోపాలం, నక్కా శ్రీనగేష్, అడపా శ్రీహరి, ఈలి గోపాలం పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీ జయంతి

**కడియం:** మండలంలోని దుళ్లలో ఆదివారం వాసవీ మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాదంపూడి శివయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అంతకు ముందు పల్లకీపై అమ్మవారిని ఊరేగించారు.

## ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

**బిక్కవోలు:** ప్లూటో గ్రహం మొదటిసారిగా అక్వేరియస్‌లోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో సోమవారం రాత్రి 10.36 గంటల నుంచి 10.56 గంటల మధ్యలో ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని కొంకుదురు శివరామకృష్ణ పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు గొలు గూరి సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పిరమిడ్ వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లూటో స్థిరమైనప్పు డు శక్తి గరిష్ట తీవ్రతకు చేరుకుంటుందని, అదేసమయంలో ప్రజలంతా ధ్యానం చేయడం వల్ల అస్తవ్యస్త పరిస్థితులు చక్కబడతాయన్నారు.

# లయన్స్ క్లబ్ హార్టికల్చర్ అధ్యక్షుడిగా ఆంజనేయులు


ప్రమాణ స్వీకారం చేస్తున్న పుల్లా ఆంజనేయులు తదితరులు

**కడియం:** లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం కడియం హార్టికల్చర్ అధ్యక్షుడిగా ప్రముఖ నర్సరీ రైతు పుల్లా ఆంజనేయులు ఎంపికయ్యారు. ఈ మేరకు కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నర్సరీ రంగ ప్రముఖులు పంతం గణపతి, నక్కా అమ్మిరాజు, బొర్సు సుబ్బారాయుడు, పుల్లా చిన సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ ప్రముఖులు మాటూరి మంగతాయారు, డాక్టర్ బాదం బాలకృష్ణ, ఎస్.అనిల్ కుమార్, బీవీఎస్ రెడ్డి, సూర్యనారాయణ, ఈశ్వర్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలు రకాల వంటి వైద్య పరీక్షలు చేసి, 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి లయన్స్ క్లబ్ ద్వారా ఆపరేషన్లు చేస్తామని పుల్లా ఆంజనేయులు తెలిపారు. రైతులకు అవసరమైన వివిధ రకాల పరికరాల ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు.

# ఇంధన పొదుపు సామాజిక బాధ్యత



పూర్ణిమా రాజేశ్వరికి ప్రథమ బహుమతి అందజేస్తున్న గెయిల్, విద్యాశాఖాధికారులు

**కంబాలచెరువు:** ఇంధన పొదుపు సామాజిక బాధ్యత కావాలని గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ బి.మొహంతి అన్నారు. గెయిల్ ఇండియా ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొహంతి మాట్లాడుతూ మానవుడు ప్రకృతిలో సహజ సంపదలుగా ఉన్న చమురు, గ్యాస్‌లను విచ్చలవిడిగా వాడేస్తూ, పర్యావరణానికి పరోక్షంగా హాని చేస్తున్నాడన్నారు. ఇదే ధోరణి కొనసాగితే రానున్న రోజుల్లో ఇంధనం దొరక్క అనేక సమస్యలు ఎదుర్కొంటారన్నారు. అవసరం మేరకు మాత్రమే వాహనాలు వాడాలన్నారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద విద్యార్థుల్లో ఇంధన పొదుపుపై అవగాహన కోసం చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి డ్రాయింగ్ కిట్ బహుమతిగా ఇచ్చారు. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 9 మందికి కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గెయిల్ సెక్యూరిటీ ఆఫీసర్ పి.సాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ ఉపాధ్యాయులు పుప్పాల బాపిరాజు, వరహాగిరి కృష్ణమోహన్, సీఆర్పీ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

# డాక్టర్ రవిశంకర్ సేవలు అభినందనీయం


రవి చైతన్య కిడ్నీ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న హోంమంత్రి తానేటి వనిత

**కంబాలచెరువు:** విశిష్ట వైద్యసేవలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వై.రవిశంకర్ అభినందనీయులని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. అధునాతన సౌకర్యాలతో రూపుదిద్దుకున్న రవి చైతన్య కిడ్నీ, చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. మరో ముఖ్యఅతిథి రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ప్రైవేట్ హాస్పిటళ్లకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందన్నారు. తమ హాస్పిటల్ వైద్య సేవలు అందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోందని రవి చైతన్య కిడ్నీ చిల్డ్రన్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.రవిశంకర్ అన్నారు. ప్రతిరోజూ టీకాలు వేస్తామని చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ కె.లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, నిమ్స్ ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ నెఫ్రాలజీ డాక్టర్ స్వర్ణలత, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ బాబు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ పిడుగు విజయ భాస్కర్ పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుల నిరసన



సీఐడీ కార్యాలయం వద్ద తెలుగుదేశం కార్యకర్తలు

**కంబాలచెరువు:** జగజ్జననీ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పలు అవకతవకలు చేశారనే అభియోగంతో ఆ సంస్థ డైరెక్టర్లు ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు ఆదిరెడ్డి వాసును సీఐడీ పోలీసులు అరెస్టు చేశారన్న విషయం తెలుసుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, కొల్లు రవీంద్ర, టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి జవహర్ తదితరులు ఆదివారం సీఐడీ కార్యాలయానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎటువంటి సంఘటనలు చోటుచేసుకుండా ముందస్తుగా సీఐడీ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత ఎదుట నిందితులు అప్పారావు, వాసును పోలీసులు హాజరుపరిచారు.

# అభ్యుదయ రచయితలకు మార్గదర్శి శ్రీశ్రీ


శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అరసం సభ్యులు

**ప్రకాశం నగర్:** అభ్యుదయ రచయితలకు మార్గదర్శి శ్రీశ్రీ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక గోరక్షణపేటలోని ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలోని సంఘ కార్యాలయంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జయంతి ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ పృథ్వీ, జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు.. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి వంటి రచనలతో ప్రజల్లో ఉత్తేజం, చైతన్యం తీసుకువచ్చి ప్రజాసాహిత్యంలో నూతన ఒరవడి సృష్టించి అభ్యుదయ కవిత్వానికి బీజం నాటారని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గ సభ్యులుగా డీఏ లింకన్, బత్తుల సూర్యప్రకాశరావును నియమించినట్లు పడాల వీరభద్రరావు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పెనుమాకుల భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు లోలబట్టు శ్రీనివాసరావు, మాదేటి రవిప్రకాష్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీ జయంత్యుత్సవం

**కడియం:** వచన కవిత్వంతో శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి ఆధునిక వైభవం తీసుకువచ్చారని ఎంఈవో వి.లజపతిరాయ్, న్యాయవాది తోరాటి వసంతరావు అన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజయోనా, చేళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవాసమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయిత చిలుకూరి శ్రీనివాసరావుకు శ్రీశ్రీ స్మారక అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీదేవి, ఉపాధ్యాయులు పితాని సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, కళాకారులు బొర్రా రామకృష్ణ, నరసింహ, తూలూరి సుబ్బారావు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో చేరికలు


ఇనుగంటివారిపేటలో నాగేంద్రను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

**సీతానగరం:** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇనుగంటివారిపేటలో తెలుగుదేశం పార్టీకి చెందిన బీసీ నాయకుడు వంగూరి నాగేంద్రతో పాటు పలువురికి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ జగన్ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. నాగేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారం చేపట్టిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.

## జోరుగా మధుర ఫలాల విక్రయాలు


రంగంపేట వద్ద ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్న మామిడి పండ్లు

**రంగంపేట:** వేసవిలో లభించే మధుర ఫలం మామిడి పండ్లు అందుబాటులోకి వచ్చేశాయి. ఏడీబీ రోడ్డు వెంబడి వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట వరకూ దుకాణాలు ఏర్పాటుచేసి తమ తోటల్లో పండిన మామిడి పండ్లను రైతులు, తోటలు పాడుకున్నవారు స్వయంగా విక్రయిస్తున్నారు. ఏడీబీ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు తమ వాహనాలను నిలిపి ప్రీతికరమైన మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. రకాన్ని బట్టి డజను మామిడి పండ్ల ధర రూ.260 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. బంగినపల్లి, చెరుకు రసాలు, సువర్ణరేఖ తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రీతికరమైన మామిడి పండ్లు అతిప్రియంగా ఉన్నాయని మామిడి పండ్ల ప్రియులు వాపోతున్నారు. మార్కెట్లలోకి ముమ్మరంగా మామిడి పండ్లు వస్తే ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులంటున్నారు.

## సెలవులను వినియోగించుకోవాలి

**బిక్కవోలు:** వేసవి సెలవుల్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు చింతా వెంకట సోమిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సందర్భంగా పాఠశాల ఆవరణలో ఐసీటీసీ వారి సౌజన్యంతో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ట్యాబ్‌లు కలిగిన విద్యార్థులంతా కొత్త పాఠ్యాంశాలు నేర్చుకోవాలని సూచించారు.

# వెంకన్న ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


యాగశాలలో జరుగుతున్న పూజలు

**మధురపూడి:** కోరుకొండ మండలం బూరుగుపూడి శివారు ఊరచెరువు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ కర్త అనంతాత్ముల బాలాజీ, ఆయన సతీమణి ఉష ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి పూజలుజరిగాయి.

108 దంపతులతో కుంకుమ పూజ నిర్వహించారు. యాగశాలలో వేదపండితులకు పట్టు వస్త్రాలను అందజేశారు. సాయంత్రం జూనియర్ జేసుదాసుతోగీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.